

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఉదయం నేను** లేచేసరికి అన్నయ్య ఆఫీసుకి వెళ్ళిపోయాడు. నిన్నటిలా కాక పొట్టి జుట్టు అలవాటైంది. కళ్ళ వాపుని అద్దంలో చూసాక నిన్నటి సంభాషణ గురించి దిగులు కలిగింది. అమ్మతో మాట్లాడదాం అని ఫోన్ చేతిలోకి తీసుకున్నాను కానీ నంబర్ డయల్ చెయ్యలేకపోయాను. కాసేపు బాల్కనీలో నిలబడి ప్రకృతిని ఆస్వాదించాను. లోపలికి వెళ్ళిన కొన్ని క్షణాలకి ఏడుపు మొదలైంది. ఏం చెయ్యాలో తోచక ఇండియాలోని ఫ్రెండ్‌కి ఫోన్ చేసాను. తను హలో అన్న కొన్ని క్షణాలవరకు నా కళ్ళలోని నీరు మాటలని రానివ్వలేదు. అతి కష్టంమీద ఏడుపుని దిగమింగుకుని "హలో" అన్నాను.

"ఓ నువ్వా? నేనింకా ఎవరో అనుకున్నాను. ఎలా ఉన్నావు? నువు వెళ్ళినప్పటినుంచి ఫోన్ చెయ్యలేదేంటని నిన్నే మేము అనుకున్నాము. దివ్యకి వీసా రిజెక్ట్ అయ్యిందట"

తెలీకుండానే కళ్ళలో నీరు మాయమై కుతూహలం మొదలైంది "ఔనా? ఎందుకు?"

"ఏదో సిల్లీ రీజన్ అట. చాలా కోపంగా ఉంది. రేపు కలుస్తానని చెప్పాను. ఫోన్‌లో రీజన్ ఏంటో చెప్పలేదు."

"నీకు చెప్పాక నాకూ చెప్పు"

"యా. చెప్తాను. నీ జర్నీ ఎలా జరిగింది?"

"నాకెంత భయమేసిందో తెల్సా? నా పక్కన ఎవరో ఒకావిడ కూర్చుంది. నన్ను చూసి ఊరిపిల్ల అనుకుని ఉంటుంది"

"ఔనా? ఏం చేసావ్?"

జర్నీ కథంతా చెప్పాను.

"మీ అన్నయ్య ఎలా ఉన్నాడు?"

"బానే ఉన్నాడు. చాలా మారిపోయాడు తెలుసా?"

"ఔనా? ఎలా?"

"మా ఇంట్లో అన్నయ్య రూం గుర్తుందా నీకు?"

"యా. చాలా డర్టీగా ఉండేది. ఇప్పుడు అలా లేదా?"

"లేదు. జస్ట్ ఆపోజిట్. చా...లా క్లీన్‌గా ఉంది ఇల్లు"

"నాకు బాగా గుర్తు. ఒకసారి మీ అన్నయ్య రూంలోకి పెన్ కోసం మనం వెళ్తే టెబుల్ మీద కాఫీ గ్లాస్ చుట్టూ ఈగలున్నాయి. నేను చూసి భయపడితే నువ్వు 'ఇది మామూలే' అన్నావు" ఇద్దరం నవ్వాం.

"ఇప్పుడు చాలా మారాడు. ఏది ఎక్కడ ఉండాలో అక్కడే పెడుతున్నాడు. నువు చూస్తే అసలు నమ్మవు" బాత్‌రూంలోకి నడిచాను.

"నిజంగానా?" తను ఆశ్చర్యపోయింది.

"ఔను. నేను బ్రష్ చేసుకుంటాను"

"సరే. ఫోన్ పెట్టనా?"

తను ఫోన్ పెట్టాక అంత నిశ్శబ్దంగా ఉంటుందన్న ఆలోచనకే దిగులు కలిగింది.

"ఒద్దు. నువ్వు ఏమైనా చెప్పు. నేను వింటూ ఫాస్ట్ ఫాస్ట్‌గా బ్రష్ చేస్తా"

నా దిగులు గ్రహించినట్టు చిన్నగా నవ్వి "సరే. ఫాస్ట్‌గా అక్కర్లేదులే. నీ టైం తీసుకో" అంది.

"థ్యాంక్స్" బ్రష్ చేతిలోకి తీసుకున్నాను.

"నా కజిన్ నితిన్‌కి గాంధీ మెడికల్ కాలేజీలో సీట్ వచ్చింది. మా పెద్దమ్మ వాళ్ళు మా ఇంట్లో ఉండి చదువుకోమంటున్నారు. కానీ తను హాస్టల్‌లోనే ఉంటా అని మొండిపట్టు పట్టాడు. హాస్టల్స్ సినిమాల్లో చూపించినట్టు జాలీగా ఉండవు. చాలా రాగింగ్ ఉంటుందని ఎంత చెప్పినా వినిపించుకోవట్లేదు. మా నాన్న రేపు గట్టిగా చెప్తా అన్నారు. ఒకవేళ తను అప్పటికీ వినకపోతే మీ కజిన్ విజయ్‌తో మాట్లాడిస్తావా?" అడిగింది.

బ్రషింగ్ పూర్తిచేసి "యా మాట్లాడిస్తాను. ఒకసారి విజయ్‌ని హాస్టల్‌కి తీసుకెళ్ళి చూపియ్యమంటా."

"విజయ్ హాస్టల్‌లో ఉంటాడా?" ఆశ్చర్యపోయింది.

"లేదు. కానీ హాస్టల్‌లో ఫ్రెండ్స్ ఉన్నారు. ఒకసారి ఆ రూమ్స్ చూస్తే తనే ఉండనంటాడు."

"ఒకే..ఒకే. థ్యాంక్స్"

"కంగ్రాజులేషన్స్ చెప్పానని చెప్పు"

"సరే చెప్తా"

కాసేపు నిశ్శబ్దం తరవాత "ఇవాళ ఏం చేస్తావ్?" అడిగింది.

"ఇప్పుడు ఖాళీనే. సాయంత్రం అన్నయ్య షాపింగ్‌కి తీసుకెళ్తా అన్నాడు. లిస్ట్ రాయాలి."

"నైస్. ఏం రాస్తావ్ లిస్ట్‌లో?"

"ఏమో? ఇంకా తెలియదు"

"నేను హెల్ప్ చెయ్యనా?"

"చెయ్యవా ప్లీజ్."

"మోనికా వాళ్ళ యూనివర్శిటీ వాళ్ళు స్లీపింగ్ బాగ్, కంఫటర్ తెచ్చుకోమన్నారట. మీ అన్నయ్యతో కొనిపిచ్చుకో."

"ఆగు. లిస్ట్ రాస్తాను" ఫోన్‌లో నోట్స్ తెరిచాను.

"వింటర్ వేర్ కూడా రాయి"

"సరే"

"ఒక బ్లాక్ కలర్, ఒక బ్లూ కలర్, ఇంకా ఒక వైట్ కలర్ జాకెట్ కొనిపిచ్చుకో"

"సరే" ఫోన్‌లో టైప్ చేసాను.

"మేచింగ్ గ్లౌజ్ కూడా"

"ఓకే. ఇంకేం కొనచ్చు?"

"ఇంకా షూస్"

"సాక్స్ కూడా ఏడ్ చేసా"

"బ్లూ షూస్, రెడ్ షూస్ కొనుక్కో. షూస్‌కి మాచ్ అయ్యే బ్యాగ్"

"ఇంకా?"

"కాలేజ్‌కి వేసుకోడానికి టెన్ టీ షర్ట్స్ తీసుకో. పార్టీకి వెళితే వేసుకోడానికి గ్రాండ్ టాప్స్ కొన్ని కొనుక్కో"

అవికూడా లిస్ట్‌కి చేర్చాను.

"ఒక పని చెయ్యి. మీ అన్నయ్యే కొంటాడు కాబట్టి అన్నిటికీ మేచింగ్ పోగులుకూడా కొనుక్కో"

"అది బెస్ట్. గుడ్ ఐడియా."

తన ఫోన్ పూర్తయ్యాక స్నానం చేసి దేవుడికి దండం పెట్టుకున్నాను. ఆ తరువాత బ్లడ్ లైన్ నవల చదవడం పూర్తిచేసి కొన్ని నిమిషాలు ఆ అనుభూతిలో జీవించాను. ఎలిజబెత్‌కి ఉన్న ధైర్యం, తెలివి నాకు ఈర్ష్య కలిగించాయి. సేమ్యూల్ రాఫ్ కథకి గుండె తరుక్కుపోయింది. నవల పూర్తైనందుకు ఎంతో దిగులు కలిగింది. అన్నయ్య నెమ్మదిగా ఈ బుక్ హేంగోవర్ అలవాటై తగ్గిపోతుందన్నాడు. కానీ ఇంకా ఎన్ని పుస్తకాలు చదివి దిగులుపడాలో ఏంటో. ఇల్లంతా నిశబ్దంగా ఉండి మరో ఆలోచన లేకపోవడంతో రాత్రి జరిగిన సంభాషణ జ్ఞాపకమొచ్చి బాధకలిగింది. ఆ బాధలోకి జారకుండా ఉండేందుకు వంట చేద్దాం అని ఫ్రిడ్జ్ తలుపు తెరిచాను కానీ మనసంతా అదోలా ఉండడంతో తలుపు మూసేసాను. ఏం చెయ్యాలో తోచక టీవీ ఆన్ చేసి 'వన్స్ అపాన్ ఎ టైం ' చూడ్డం మొదలుపెట్టాను. బ్లడ్ లైన్‌కి, దీనికి పోలికలేదు. ఇందులో మంత్రాలు, తంత్రాలు, ఫెయిరీ టేల్స్. అమ్మ చూస్తే 'చిన్నపిల్లలవి నచ్చడమేంటి?' అంటుంది కాబోలు. ఒక రెండు ఎపిసోడ్లు చూసాక టీపాయ్ మీద లైబ్రరీ నుండి తెచ్చిన పుస్తకాలు కనబడ్డాయి. నేను ఇక్కడ ఉండేది ఇంకా అయిదురోజులు మాత్రమే. వెళ్ళేలోపు చెయ్యాల్సిన పనులు కూడా ఎన్నో ఉన్నాయి. ఆ పుస్తకాలు వెంటనే చదవడం మేలనిపించి నికొలస్

స్పార్క్స్ రాసిన 'ఎ వాక్ టు రిమెంబర్' చేతిలోకి తీసుకున్నాను. మెదడులో బ్లడ్‌లైన్ మెదలడం వల్ల మొదటి కొన్ని పేజీలు ఇబ్బందిగా చదివాను. నెమ్మదిగా కథలోకి జారుకున్నాను. ఇంతలో అన్నయ్య నుండి ఫోన్ వచ్చింది.

"టెన్ మినిట్స్‌లో కిందకి వస్తావా?" అడిగాడు.

"దేనికి?" ఆశ్చర్యపోయాను.

"షాపింగ్‌కి వెళ్దామనుకున్నాము కదా?" విసుక్కున్నాడు.

"అప్పుడేనా?"

"అప్పుడే ఏంటి? సాయంత్రం అవుతుంటే?" అసహనంగా బదులిచ్చాడు.

"సారీ టైం చూసుకోలేదు. కిందకొస్తున్నాను" ఫోన్ పెట్టి బట్టలు మార్చుకుని గబుక్కున కిందకి వెళ్ళాను. అన్నయ్య కారు అప్పుడే రావడం గమనించి ఊపిరి పీల్చుకున్నాను.

"నువ్వు చెప్పినట్టే పొట్టి జుట్టు వల్ల టైం చాలా సేవ్ అవుతుంది" కారెక్కుతూ చెప్పాను.

"వ్యంగ్యమా?"

"కాదు. నిజంగానే. పొడుగు జుట్టుంటే ఇప్పుడు కిందకి వచ్చుండేదాన్ని" ఆ అపార్ట్‌మెంట్ బయట సందులోకి కారు తిప్పుతుండగా అన్నాను.

అన్నయ్య చిన్నగా నవ్వాడు.

"ఏం కావాలో లిస్ట్ రాసావా?"

"ఆఁ రాసాను" మొహం విప్పారిస్తూ చెప్పాను.

"మధ్యాహ్నం పడుకున్నావా?"

"లేదు. ఎందుకు?"

"ఫోన్ చేసినప్పుడు అయోమయంగా ఉంటేనూ."

"అయోమయం ఏంకాదు. టైం చూసుకోలేదంతే."

"అంత బిజీ పనేం చేసావు?"

"పొద్దున ఫ్రెండ్‌కి ఫోన్ చేసాను. తరువాత కొంచెంసేపు బుక్ చదివాను, కొంచెంసేపు టీవి చూసాను. చాలా ఫాస్ట్‌గా గడిచిపోయింది రోజు"

"నీ ఫ్రెండ్‌తో నాలుగు గంటలు మాట్లాడి వుంటావు. అందుకే ఫాస్ట్‌గా గడిచి వుంటుంది" వెటకారంగా నవ్వాడు.

"ఏంకాదు" కోప్పడ్డాను.

"సర్లేకానీ ఫాస్ట్‌గా షాపింగ్ పూర్తిచేసి డిన్నర్‌కి వెళ్దాం. నాకు ఆకలి మొదలయ్యేట్లుంది. నీకు జపనీస్ ఫుడ్ ఇష్టమా?" అడిగాడు.

"నూడుల్స్ తింటాను"

"సూషీ"

"ఏమో? ఎప్పుడూ తినలేదు"

"ఇవాళ ట్రై చెయ్యి. నాకు చాలా ఇష్టం"

"ఔనా? ఎలా ఉంటుంది?"

"సీవిడ్ పేపర్ మీద అన్నం, కీరా, అస్పరాగస్, అవకాడో పెట్టి చుడతారు. సాయ్ సాస్, వసాబీ ఇంకా జింజర్‌తో తినాలి"

"సీవిడ్ అంటే పాచి కదా?" మొహం చిట్లిచ్చాను.

"పాచి కంపు కొట్టదులే" నవ్వాడు.

"అస్పరాగస్, వసాబీ నేను ఎప్పుడూ తినలేదు" చిన్నబోయాను.

"పరవాలేదు. ఇవాళ ట్రై చేసి చూడు. నాకు తెలిసి నీకూ నచ్చుతుంది. వసాబీ చాలా ఘాటుగా ఉంటుంది. అందుకని ఒకేసారి ఎక్కువ తినకూడదు. చూడ్డానికి బఠాణీల్లా ఉంటాయి" వివరించాడు.

"కీరా, అస్పరాగస్ ఇంక ఆవకాడో వేయించినవా?"

"కాదుగా" పెద్దగా నవ్వాడు.

ఇంకేమడిగినా నవ్వుతాడని అర్థమై ఏం మాట్లాడలేదు.

కొద్దిసేపటికి "ఇదే మా ఊళ్ళో అన్నిటికన్నా పెద్ద మాల్. పద" అంటూ కారు దిగాడు.

ఎంతో ఉత్సాహంగా అన్నయ్యతో కలిసి నడిచాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story